# అద్దెకొంప

మా శారదాంబ మొగుడు శివకామయ్య యోగ్యుడే కాని వాడి కుటుంబంలో వాడికి పోల్చదగిన మనిషి లేడు. శివకామయ్య తండ్రి వొట్టి దద్దమ్మ. పెళ్లాం ఎంత చెపితే అంతా. వాళ్ళవూళ్ళో పార్వతీశంగారిల్లంటే ఎవరూ చెప్పరు: కామాక్షమ్మగారిల్లంటే ఎవరికన్నా తెలుస్తుంది. అంతేకాదు; కానూరి కామాక్షమ్మ అని ఆవిడ నెవ్వరూ పిలవరు. కూనపల్లి కామాక్షమ్మ అనే పిలుస్తారు. ఆవిడ కూనపల్లివారి ఆడబడుచు. ఏడుగురు పిల్లలతల్లి అయినా ఈనాటికీ ఆవిడ కన్నవారింటనే ఉంటున్నది. ఎరగనివాళ్ళు పార్వతీశం ఇల్లరికమునికూడా అనుకోవటం కద్దు. కాని నిజం ఏమంటే కామాక్షమ్మ తండ్రిగారి కాపరం ఏనాడో చితికి పోయింది. జప్తుచేసిన తండ్రి ఆస్తిని కామాక్షమ్మ మొగుడి చేతనే కొనిపించింది. అందుకోసం పార్వతీశం అప్పుచెయ్య వలసి వచ్చింది. ఆ అప్పుతీరక, స్వగృహం అమ్ముకోవలసి కూడా వచ్చింది. మామగారి కొంప వ్యవహారరీత్యా తనదే అయినా, పార్వతీశంగారు దాన్ని మామగారి ఇల్లల్లేనే

చూశాడు. తనకన్న మామగారి వాళ్ళకే ఆ యింటిమీద అధికారం ఎక్కువ ఉన్నట్టుగా భావించాడు. అతని తరఫున బంధువులు ఎవరు వచ్చినా వాళ్ళకా యిల్లు పార్వతీశం మామగారిదే——కాకపోతే, కూనపల్లి కామాక్షమ్మగారిది – అనిపించేది గాని, పార్వతీశం గారి దనిపించేదికాదు. కామాక్షమ్మ తల్లి దండ్రులూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ కూడా ఆ యింటిని స్వగృహంలాగే చూసుకునేవాళ్ళు. అయిందా, కామాక్షమ్మ నోరు చెడ్డది. ఆమె హృదయం చాలా మంచిదని చెబుతారుగాని, దాన్ని గురించి సాక్ష్యం దొరికేదికాదు. ఎప్పుడన్నా తన కిష్టమైనవారికి మొగుడి సొత్తు పంచితే పంచేదేమో మన మెందుకు కాదనాలి? కాని మొత్తంమీద ఒకటి నిజం. పార్వతీశంలాంటి నోరూ వాయీ లేనివాడిలో వెయ్యి మంచిగుణాలున్నా గమనించేవాళ్ళుండరు. కామాక్షమ్మలాంటి గచ్చపొదలో ఏమాత్రం మంచి ఉన్నా వెంటనే ప్రచారం అవుతుంది. ఆవిడ కోడళ్ళను కోసుకు తినేది. ఆ మాటంటే "కోడళ్ళ కావిడ ఇచ్చే శిక్షణ తల్లులు కూతుళ్ళకు కూడా ఇవ్వరు!" అనే వాళ్ళు. నిజానికి కామాక్షమ్మ పెద్దకోడలు అమిత దురుసుపిల్ల. వాళ్ళ పుట్టింటివాళ్ళు, "ఇది కాపరం ఏం చేస్తుంది? ఏ మొగుడు దీనితో వేగుతాడు?" అనుకునేవాళ్ళు. అటువంటి రాక్షసి పిల్ల కామాక్షమ్మ ఇంట అడుగు పెట్టిన ఆరునెల్లలోపల పిల్లి అయిపోయింది.

అగ్నికి వాయువు తోడైనట్టు కామాక్షమ్మ గారికి

తోడుగా ఉండేది విధవ అప్పగారు. ఆ యిద్దరి మధ్య నలిగి పోతుండేవాళ్ళు ఇంటి కోడళ్లు. ఇంటి కొడుకులకు తల్లిని చూస్తే చెడ్డ భయం. పెళ్ళాలతో మాట్లాడాలన్నా వాళ్ళు తల్లి అనుమతి పొందవలసిందే. ఇంట్లో ఉన్న పదిమందీ ఒక్క మనిషి మాటమీద పోవటం వల్ల పైకి కాపగం చాలా గుంభనగా కనిపించేది. కాని లోపల ఏ ఒక్కరికీ సుఖం ఉండేది కాదని నా అనుమానం. కామాక్షమ్మగారి పెత్తనానికి ఎదురుతిరిగి వాళ్లు ఇద్దరు కనిపిస్తారు. అందులో మొదటిది మా శివకామయ్య చెల్లెలు, కృష్ణవేణి. అంటే మా శారదాంబ మూడో ఆడబడుచు. ఆవిడ మొగుడిదగ్గ రికి వెళ్ళినాక తిరిగి పుట్టింటి గడప తొక్కలేదు. ఈ విధంగా ఇల్లు వదిలి పెట్టి పోయిన మరో కుర్రవాడు శివకామయ్య. తరువాతవాడు సుందరం.

ఇదంతా ఎందుకు చెప్పానంటే మా శారదాంబను అటువంటి ఇంటో ఇచ్చాం. కామాక్షమ్మగారు కోడళ్ళను కాల్చుకు తినటంలో మొరటు పద్ధతులు లేవు. కొట్టటమూ, తిట్టటమూ, వాతలు వెయ్యటమూ అన్నం పెట్టక మాడ్చి చంపటమూ మొదలైనవీ లేవు. అందుచేత ఆవిణ్ణి గురించి నలుగురూ అనుకోవటం కూడా జరగలేదు. మా శారదాంబ లాగా ఆత్మాభిమానంతో పెరిగిన పిల్లకి తిట్లకన్నా, దెబ్బల కన్నా ఒకమాట భరించటం చాలా కష్టం. తొందరపడి దానిమీద నేరం మోపితేనే సహించని మనిషిని... కామా క్షమ్మగారి కవాతుకు ఎట్లా లొంగుతుంది? శారదాంబ

ఎప్పుడూ నోరుచేసుకునే రకంకూడా కాదు. భరించలేని పరిస్థితి అని తోస్తే ఏదో అఘాయిత్యం చేసేస్తుంది.

అందుచేత శివకామయ్యకు పట్నంలో ఉద్యోగం దొరికిందంటే చాలా సంతోషించాను. ఎందుచేతనంటే, మొదటనే చెప్పినట్టు, అతను చాలా యోగ్యుడు. మా శారదాంబక్కూడా అతనంటే చాలా సదభిప్రాయమే ఉంది. కాని అతను ఇంటిదగ్గర ఉన్నంతకాలమూ మా శారదాంబకు సుఖం లేకపోయింది. ఈ ఉద్యోగం దొరకటం అతని ప్రాణానికీ, దాని ప్రాణాలకూ, మా ప్రాణాలకు కూడా ఎంతో సుఖమిచ్చింది.

అవి యుద్ధం రోజులు. శివకామయ్యకు దొరికిన ఉద్యోగంకూడా తత్సంబంధమైనదే. అయితే ఏమొచ్చిందంటే అతను మా శారదాంబను వెంటబెట్టుకొని పట్నంలో కాపరం పెట్టాడో లేదో, ఇంతలోనే మద్రాసుకు విమాన దాడి భయం జాస్తి అయి, అక్కడినుంచి మన తెలుగు వాళ్లు సకుటుంబంగా స్వగ్రామాలకు పారిపోయి. రాసాగారు ఏమాటకామాటే చెప్పాలి. మన శివకామయ్య భయం లేదని చెబుతూనే ఉన్నాడు. అని మేం - అంటే మా వాళ్ళంతా - శారదాంబను గురించి, భయపడసాగాం. శివకామయ్య ఉద్యోగం వదిలి రాలేదు. శారదాంబకున్న పాటి ప్రాణభయం అతనికీ ఉంది. కాని మేం తన్ని గురించి అట్టే విచారించలేదు. మా పిల్లను గురించే భయపడ్డాం. శారదదాంబను పంపితేగాని వీలులేదని పట్టుపడితే , మామాట

తీసివెయ్యలేక అతను శారదాంబను మా యింటికి పంపే శాడు.

అయితే ఏమయిందంటే, శారదాంబ వచ్చిన కొద్ది కాలానికే ఆ విషయంకూడా రూఢీ అయింది. ఆ సంగతి తెలియగానే దాని అత్తగారు దాన్ని తమయింటికి తీసుకు వెళ్ళి అయిదో నెలలో పంపిస్తామన్నారు సరే రెండు నెలలు అత్తవారింట గడిపి మా శారదాంబ పురిటికి తిరిగి మా యింటికి వచ్చేసింది. దానికి పురుడొచ్చి, పిల్లవాడుపుట్టి వాడికో మూడు నెలలు గడిచే సరికి అక్కడ పట్నంలో పరిస్థితులు మారిపోయినై. పట్నంనుంచి వెళ్ళిపోయిన వాళ్ళంతా తిరిగి రాసాగారు. పట్నంలో యిళ్ళన్నీ గబ గబా అయిపోతున్నాయి.

ఇంటివాళ్ళు బతిమాలగా, బతిమాలగా మా శివ కామయ్య తాత్కాలికంగా తన భాగంలోనుంచి రెండు గదులు ఇంటి వాళ్ళకిచ్చేసి తను సామానుతో సహా ఒక్క గదిలో చేరాడు. ఇంటివాళ్ళు శివకామయ్యను ఎంతో మర్యాదగా చూసేవాళ్ళు కారణమేమంటే ఆరు నెల్లపాటు ఇల్లంతటికీ శివకామయ్య ఒక్కడే వుండి ఇంటిని కాపాడాడు. నాలుగు మాసాల అద్దె అతని దగ్గర వాళ్ళు తీసుకోలేదు కూడాను. అటువంటి పరిస్థితిలో వాళ్లు రెండు గదులివ్వ మంటే శివకామయ్య కాదనలేకపోయాడు. అదికాక వాళ్ళు మాటకూడా యిచ్చారు. మా శారదాంబ రాగానే, నూరా రయినా, ఆరు నూరయినా ఆ రెండు గదులూ తిరిగి ఇప్పిం

చేస్తామన్నారు. సహం ఆ ధైర్యంతోటే శివకామయ్య గదులు ఖాళీచేశాడు.

పిల్లవాడికి మూడో నెల అనగా శారదాంబ అత్తవారు తీసుకువెళ్ళారు. మళ్లీ పట్నం వెళ్లితే ఎప్పటికో! వాళ్ళకు మాత్రం పిల్లవాడి ముద్దుముచ్చట్లు చూచుకోవాలనిఉండదూ? శారదాంబ అత్తవారింట రెండు నెలలుండి పట్నవెళ్ళ టానికి ఏర్పాటయింది. ఫలాని తేదికి తనకు రెండు గదులూ తిరిగి కావాలని ఇంటివారితో చెప్పాడు శివకామయ్య. దానికేం భాగ్యమన్నారు ఇంటివారు. శారదాంబ ఇంకో వారానికి బయలుదేరుతుందనగా శివకామయ్య మళ్ళీ ఇంటి వారిని హెచ్చరించాడు. ఆ గదిలో మరెవ్వరో ఉంటు న్నారు. వారు ఈ లోపుగానే మరో యిల్లు చూచుకుని వెళ్ళిపోతున్నారని ఇంటాయన శివకామయ్యకు తెలిసి పోయింది. బయలు దేరవద్దని శారదాంబకు తంతి ఇచ్చాడు. "నా దగ్గర మూడు గదులకూ అద్దె పుచ్చుకుంటూ ఇదేం పని?" అని ఇల్లుగలవాళ్ళని అడిగాడు. దానికి ఇంటివాళ్లు "ఈ రోజుల్లో పదిహేను రూపాయలకు మూడు గదులెట్లా వస్తాయి? నీ రెండు గదులకూ కలసి పాతికరూపాయలు చెవులు మెలేసి పుచ్చుకుంటున్నాము" అని సమాధానం చెప్పారు.

ఇంటివాళ్ల డబ్బు దాహమూ, దగాబుద్ధీ చూస్తే మా శివకామయ్యకు ఆశ్చర్యం వేసింది. యుద్ధం మూలంగా ప్రజల మన స్తత్వంలో కలిగిన మార్పు ప్రత్యక్షంగా

చూడటం అతనికిదే మొదటిసారి. కాని చేసేదేమో కనిపించలేదు. ఇగో ఇంటికోసం వెతుకుదామంటే ఆదివారం తప్ప తీరదు. కాకపోయినా కాళ్ళకు బలపాలు కట్టుకుని తిరిగే వాళ్ళకే ఇళ్ళు దొరక్కుండా ఉన్నాయి. దొరికేవాళ్ళకు దొరుకుతున్నయ్యనుకోండి. వందలకొద్దీ లంచాలు పెట్టాలి. లేదా ఇచ్చే బాడుగల్లో సహానికే రశీదు తీసుకోటానికి ఒప్పుకోవాలి. అదీకాకపోతే రెండు సంవత్సరాల అద్దె_ అంటే ఇల్లు కట్టటానికి అయ్యే ఖర్చులో ఏ అయిదోవంతో ఆరోవంతునుముందుగా దర్శించుకోవాలి.

ఈ పరిస్థితుల్లో మా శారదాంబ అత్తవారింట్లో నేనుండి పోవలసవచ్చింది. అక్కడే వచ్చింది చిక్కు. మా శారదాంబ అత్తగారు తన పద్ధతులు మార్చుకోలేదు. ఆ పద్ధతులకు మా చెల్లెలు అలవాటుపడుతుందా అంటే, అదీకనిపించలేదు. దాని దగ్గర్నుంచి నాకు వారానికో ఉత్తరం రాసాగింది. ప్రతి ఉత్తరంలోనూ చివరికి ఒకటే ముక్క. "నేనిక్కడ ఒక్క క్షణం ఉండలేను. ఎవరికీ చెప్పకుండా బయల్దేరి వచ్చేస్తాను. కాని అవతల పట్నంలో తన మొగుడికి కొంపలేదాయె మా ఇంటికి తీసుకుపోతే బాగుండదాయె. దాని అత్త గారింటో, అందరి అభిప్రాయమూ ఏమంటే ఇవ్వాళో, రేపో శివకామయ్య ఇల్లు సంపాదిస్తాడని, అటువంటప్పుడు మా శారదాంబను మేం తీసుకుపోతామంటే ఏం బాగుంటుంది ?

ఒకసారి ఏదో వంక పెట్టుకొని కామాక్షమ్మగారి యింటికి వెళ్ళాను పీలుచేసుకుని మా శారదాంబతో మాట్లాడి చూశాను. ఎవరెవరి మీదో పెట్టి తనను నానా మాటలూ అంటారంటుంది. ఇందులో మా శార దాంబ అనుకోవటం ఎంతో, నిజమెంతో నాకయితే తెలీదుగాని, శారదాంబ బాధపడుతున్నదనటంలో అతి శయోక్తి ఏమీలేదు.

అందుచేత శివకామయ్యకు ఉత్తరం వ్రాస్తూ శార దాంబ పరిస్థితిగురించి అది రాసుకోలేని వివరాలన్నీ రాశాను. తన వాళ్ళనుగురించి రాశానని అతను అనుకునేవాడు కాదులెండి.

నా ఉత్తరం అందిన కొద్దిరోజుల్లోనే శివకామయ్య ఒక అఘాయిత్యం చేశాడు. తన భాగంలో ఉండవలసిన గదులు ఇంటాయన అవసరానికి తీసుకుని తిరిగి ఇవ్వటం లేదని రెంటు కంట్రోలరుదగ్గర ఫిర్యాదుచేశాడు. రెంటు కంట్రోలరు ధర్మాత్ములు. ఇంటాయన చెప్పిన అబద్ధాలన్నీ నమ్మక శివకామయ్యదే న్యాయమని గుర్తించాడు. అయితే ఇంటాయన ఇంకో పేచీ పెట్టాడు. సంవత్సరంన్నర క్రితం నాలుగు నెల్లపాటు శివకామయ్య అద్దెఇవ్వలేదనీఅందు చేత అతన్ని ఖాళీచేయించమనీ అర్జీ పెట్టుకున్నాడు. న్యాయా నికి శివకామయ్యదగ్గర నాలుగు నెలల అద్దె రశీదులు లేవు. దానికి కారణం, ఇంటాయన అప్పట్లో అద్దె తీసుకోనన్నాడు. ఆనాడు కృతజ్ఞతాపూర్వకంగా చేసినపని ఈనాడు స్వార్థ

నికి అక్కరకు వచ్చింది. అయినా శివకామయ్యే గెలిచాడు. ఆ పాతశాకీ ఆరునెలలమీద తీర్చేటట్టు శివకామయ్యకు అవకాశంయిచ్చి రెంటు కంట్రోలర్ శివకామయ్యకు రెండు గదులూ ఇప్పించాడు. రెంటు కంట్రోలరు ధర్మమా అంటూ మా శారదాంబ పట్నం వచ్చేసింది.

*　　　*　　　*

నేను పట్నంవచ్చి వారంరోజులయింది. ఈ వారం రోజులనుంచి చాలా విచిత్రమైన కథ నడవటం చూస్తున్నాను.

ప్రతిరోజూ ముప్పూటలా ఇంటావిడ వాటింటోంచి నానా అవాచ్యాలూ మాట్లాడుతుంది. అవి శాపనార్థాలు కావు, అవి రంకెలుకావు! ఆవిడ అనే మాటల్లో కాస్త సౌమ్యమయినవి ఏమిటంటే, "వీళ్ళకి సిగ్గన్నా లేదేం? మా యింటోంచి పొమ్మంటే పోయిచావరేం? మా కొంప తప్పితే వీళ్ళకి నిలవనీడే లేదేమో! అయితే చెట్టుకింద పడుకోరాదూ? సిగులా! ఛీ విళ్ళ మొహాలు తగలెయ్యా. కోర్టుకు పోతారట. వీళ్ళ పిండాలు పిల్లులకెయ్యా!" ఈ ధోరణిలో.

మామూలు మధ్యతరగతి కుటుంబాల్లో గౌరవంగా బ్రతికే ఆడకూతురునోట ఇటువంటి మాటలు రావటం నా కాశ్చర్యం వేసింది.

"ఎవర్ని ఆ తిట్లు. తిట్టుతున్నది?" అని మా శారదాంబ నడిగాను!

శారదాంబ నవ్వి "ఇంకేవన్ని? మమ్మల్నే! చావనీ గింజుకోనీ! మేం ఇల్లు ఖాళీచేస్తే ఈ భాగాన్నే నలభై రూపాయలకి ఎవరికన్నా ఇవ్వాలని వాళ్ళ ఆలోచన. డబ్బు దాహం నోటంట అట్లా పలుకుతున్నది. ఇదేం చూశావూ? దొడ్లో పొరపాటున చెంబు వదిలేసినా, ఎత్తుకుపోతారు. వాళ్ళకు పనికిరానిదైతే విరగగొడతారు. కొళాయిగొట్టం చిల్లిపొడిచి మా పక్క సందంతా నీళ్ళప్రవాహం చేశారు. అలగా కుర్రవాళ్ళకు కానీ అర్ధణా చేతిలోపెట్టి మా కిటికీ ముందునుంచి బండబూతులు అనిపిస్తారు!" అన్నది.

ఇదంతా ఎలా భరిస్తున్నావని మా శారదాంబను నే నడుగలేదు. ఎలా భరిస్తున్నదో, శారదాంబ ఎంతవరకు మారిందో నే అర్థంచేసుకోగలిగాను. మా శారదాంబ అత్త వారింటో అనుభులో వున్నది క్షీణించిపోతున్న సంస్కృతికి చెందిన వికృత ఆచారం. కనుకనే శారదాంబ దాన్ని అతి క్రమించి అసహనం ప్రకటించగలిగింది. ఇక్కడ ఈ మద్రాసులో అద్దెయింటి సమస్య అటువంటిదికాదు. దీని మూల కందమేమిటో, ఎలా దీన్ని ఎదుర్కోవాలో మా శారదాంబకు తెలియదు, తెలియలేదు. అందుచేతనే దీన్ని సులభంగా భరించగలిగింది. ఏ ఇబ్బంది అయినా తప్పనిసరి కాదనీ, పరిష్కారమవుతుందనీ స్పష్టంగా తెలిసేవరకూ మనం తిరుగుబాటు చెయ్యలేము గదా!